క్లుప్తంగా

వెద సాగుతో అధిక దిగుబడి



సీడ్ డ్రిల్ ద్వారా పొడి వెదలు వేస్తున్న రైతులు

గుర్ల: వరి విత్తనాలను పొడి వెదలుగా వేసి సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని రెడ్డీసీ ఫౌండేషన్ వ్యవసాయ సమన్వయకర్త మంత్రి సంతోష్ అన్నారు. మండలంలోని చింతలపేటలో సీడ్‌డ్రిల్ ద్వారా శనివారం వెదలు వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సమన్వయకర్త సంతోష్ మాట్లాడుతూ.. సీడ్ డ్రిల్ ద్వారా వెదలు వేయడం వల్ల అధిక పిలకలు వస్తాయని, దీంతో దిగుబడి బాగా పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు సూరపు నాయుడు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాలు



చినగుడిపాలలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కె.గాయత్రి పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే లాభాలు, పశుగ్రాసం ప్రాముఖ్యత, పశుగ్రాస పెంపకంపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పథకాలను వివరించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి పశువులకు వైద్యసేవలందించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ బి.రామానాయుడు సందర్శించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఆమె స్వగృహంలో వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు 11, 09, 363 రూపాయల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమై ఏడాది పూర్తయిందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు కోటి రూపాయలకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యాక్సినేషన్



టీకాలు వేసేందుకు సిద్ధమైన వైద్యారోగ్య సిబ్బంది

విజయనగరం: నగర వ్యాప్తంగా వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఓ వైపు ఫీవర్ సర్వే చేస్తూనే మరోవైపు రోగ నిరోధక టీకాలు వేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులపై ఆరాతీస్తున్నారు. అలాగే రోగాలు ప్రబలకుండా టీకాలు వేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు ఈ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

శరవేగంగా తాగునీటి పైపులైన్ మరమ్మతులు



పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. పైపులైన్‌కు లీకేజీ పడిన ప్రాంతాన్ని గుర్తించి, లీకులను అరికట్టే చర్యలు చేపడుతున్నారు. వీటీ అగ్రహారం, కొత్తపేట, బీసీ కాలనీలో రెండు చోట్ల పైపులైను లీకేజీలను గుర్తించగా వాటి మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు సురక్షితమైన మంచినీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.

'సేంద్రియం'పై రైతన్న దృష్టి..

- పంట పొలాలకు పశువుల పేడ, చెరువు మట్టి తరలింపు
- మంచి దిగుబడులు వస్తున్నాయంటూ ఆనందం



కొత్తవలస మండలం వీరభద్రపురం సమీపంలో సేంద్రియ ఎరువులతో ఏపుగా పెరిగిన నువ్వు పంట



పశువుల పేడతో రైతులు తయారు చేసుకున్న ఎరువు

లక్కవరపుకోట: రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గి నష్టపోతున్న రైతన్నలు.. కొన్నాళ్లుగా సేంద్రియ ఎరువులపై దృష్టి సారిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల ఎరువులను పొలాల్లో వేస్తూ రైతులు బిజీగా కనిపిస్తున్నారు. వర్షాధార పంటలు సాగుచేసే కొత్తవలస, లక్కవరపుకోట మండలాల గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువులను తరలిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. భారీగా పెరిగిన రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోవడంతో పాటూ సేద్యానికి అధిక వ్యయం ఖర్చవుతోందని అన్నదాతలు తెలిపారు. యూరియా, డీఏపీ, పురుగు మందులకు బదులు వేపాకు, కాము పిక్కలతో సొంతంగా తయారు చేసుకున్న ఎరువుతో పాటు పశువులు, కోళ్ల పెంట వినియోగించడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

అధిక దిగుబడులు..



ప్రతి ఏడాదీ సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల జోలికి పోవడం లేదు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన పంటలను పండించుకుంటున్నాం.

– గుల్లిపల్లి అప్పలరాజు, రైతు శ్రీరాంపురం, లక్కవరపుకోట మండలం

పశువుల పెంటనే వాడుతున్నాం..



పంట పొలాలకు పశువుల ఎరువునే వాడుతున్నాం. అలాగే చెరువుల్లో ఉండే ఒండ్రు మట్టిని మెరక ప్రాంతాల్లో పండించే వేరుశనగ, కర్రపెండలం పంటలకు వేశాం. సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయి.

గండి పైడిరాజు, లింగంపేట గ్రామం, లక్కవరపుకోట మండలం

అవగాహన కల్పిస్తున్నాం..

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై రైతుల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. మూడు సంవత్సరాలుగా రసాయన ఎరువుల వాడకం తగ్గింది.

– కె.సరస్వతి, సబల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, కొత్తవలస మండలం.

అన్నదాతలకు తప్పని కష్టాలు



గుర్లలో విద్యుత్ మోటార్ల లైన్‌కు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న రైతులు

గుర్ల: మండల కేంద్రంలోని రైతులు కరెంట్ కోసం కష్టాలు పడుతున్నారు. వరి నారుకు నీరు లేక ఎండిపోతున్నాయని, నీరు కట్టడానికి మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. విద్యుత్ లైన్ వెంబడి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎప్పటికప్పుడు సరఫరా నిలిచిపోతోందని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో శనివారం రైతులందరూ ఏకమై జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

16న ఇంటర్వ్యూలు

గంట్యాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జూవాలజీ (జంతుశాస్త్రం)గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి ఈ నెల 16న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్‌వీఎస్ జగన్నాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

పత్రాలు తప్పనిసరి

దత్తిరాజేరు: ద్విచక్ర వాహన చోదకులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని ఎస్. బూర్జవలస ఎస్సై రాజేష్ అన్నారు. శనివారం సాయంత్రం స్టేషన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు అన్ని పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.

ప్రజాసేవ కోసమే 'జన సేవాదళ్'

విజయనగరం గంటస్తంభం: నగరంలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగే జన సేవాదళ్ శిక్షణా శిబిరాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక అమర్ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవ కోసమే జన సేవాదళ్‌ను సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అప్పట్లో స్థాపించారని గుర్తు చేశారు. తుపానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జన సేవాదళ్ సేవలందిస్తుందన్నారు. ప్రజాసేవ చేయాలనుకునే వారంతా జన సేవాదళ్‌లో చేరవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, ఉపాధ్యక్షుడు ఎ.సుమన్, సహాయ కార్యదర్శి వి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖరనాయుడు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు ఆల్కహాల్ వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర నాయుడు మాట్లాడుతూ.. మద్యం అలవాటు వల్ల జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. మద్యానికి బానిసలైన వారిని రీ హాబిలిటేషన్ సెంటర్‌కు పంపించి ప్రత్యేక చికిత్స అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మోసపోయామని ప్రజలు గ్రహించారు..

- మాజీ ఎమ్మెల్యే కడుబండి
- మనం ప్రజల గొంతుక కావాలి
- కూటమి మోసాలను వివరించాలి
- 17 నుంచి రెండు వారాల క్షేత్రస్థాయి పర్యటన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: తాము మోసపోయినట్లు ప్రజలు గ్రహించారు.. మనం ప్రజల గొంతుక కావాలి.. ఇదే సమయంలో సూపర్‌సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం మెడలు వంచాలని ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ వేపాడ మండల అధ్యక్షుడు మమ్ములూరి జగన్నాథం అధ్యక్షతన వేపాడ మండల కేంద్రంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ అని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఏడాది కాలం పాటు నిరీక్షించిన తర్వాత ప్రజల తరఫున వెన్నుపోటు దినం నిర్వహించగా.. ప్రజల నుంచి విపరీతమైన మద్దతు వచ్చిందని చెప్పారు. మనం వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించిన తర్వాత వెంటనే జూలై 4న తల్లికి వందనం ఇచ్చారని తెలిపారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఎక్కడ పర్యటించినా, వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారని చెప్పారు. ఇదే సమయంలో కూటమి మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదాత సుఖీభవ రాలేదు.. ఆడబిడ్డ నిధి అందలేదు.. ఉచిత సిలెండర్లు, ఉచిత బస్ జాడే లేదు.. ఇంటికో ఉద్యోగం రాలేదు.. నిరుద్యోగ భృతి అందలేదని చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించే బాధ్యత మనం తీసుకోవాలన్నారు. కూటమి పాలనలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' అన్న కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మమ్ములూరి జగ్గుబాబు మాట్లాడుతూ.. కూటమి చేసిన తప్పులను, అమలు కాని హామీలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి రెండు వారాల పాటు కార్యక్రమం నిర్వహణకు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరాము నాయుడు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు శానాపతి అప్పారావు, మండల ఉపాధ్యక్షుడు అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు వెంకటరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, దుళ్ల మహేష్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలు, బాధ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు

గంట్యాడ: మండలంలోని కొండతామరాపల్లి కల్యాణ మంటపంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు జాగారపు అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' అనే అంశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి..

గుర్ల: పట్టణంలోని ఫేకర్ రోడ్డులో గల వి కన్వెన్షన్‌లో సోమవారం జరగబోయే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం పార్టీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్సీ, శాసమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఎస్.కోట, ఎల్.కోట మండలాలకు సంబంధించి..

కొత్తవలస: లక్కవరపుకోట, శృంగవరపుకోట మండలాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాలను సోమవారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు లక్కవరపుకోట మండల విస్తృతస్థాయి సమావేశం గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో గల కల్యాణ మంటపంలో... మధ్యాహ్నం 3 గంటలకు ఎస్.కోట మండల కేంద్రంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లుమ పేర్కొన్నారు. అలాగే 15న కొత్తవలస మండల విస్తృతస్థాయి సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ఆయా మండలాల ముఖ్య నాయుకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆల్తి రమణ, పరిశీలకుడిగా వి.రాంబాబు వ్యవహరించారు. పంచాయతీ రాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీపురుపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా టి.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్‌ఈ.బేగం, కార్యదర్శిగా ఆర్.వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీగా పి.సంతోష్‌కుమార్, కోశాధికారిగా వీవీ సత్యానారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.తాత, ఎం.అశ్విని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మురళి, ప్రతినిధులు పీఎం.రవికుమార్, కేబీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇప్పిలి జన్మదినం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతరం జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దన్నాన జనార్దనరావు, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, కరమజ్జి శ్రీనివాసరావు, కొమ్ము చిరంజీవి, గవిడి సురేష్, రేవల్ల సత్తిబాబు, ఎంవీఎస్ఎన్.రాజు, చందక గురునాయుడు, కరణపు ఆది, ముజీకీర్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

శృంగవరపుకోట: జనసేన ఇన్‌చార్జ్‌పై జన సైనికులు చేసిన ఆరోపణలు అవాస్తవమని.. స్థానిక జనసేన నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్.కోట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ ఒబ్బిన సత్యనారాయణ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నారని, చెప్పారు. కూటమిలో మిత్రధర్మం పాటిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని.. సమస్యలను స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి వద్దకు తీసుకెళ్తూ పరిష్కారం కోసం పనిచేస్తున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో తాండ్రంగి చంటి, మోపాడ కృష్ణ, దొగ్గ రమణ, పి.రామదుర్గ, ఎం.శ్రీను, టి.రాము, వై.దేముడు, రవి, నాని, పి.సంతోష్ ,ఎల్‌వీ ప్రసాద్, రావాడ నాయుడు, కె.రామదాసు, బి.సత్యనారాయణ, జి.శ్రీను, జి.అప్పలనాయుడు, బి.శ్రీను, టి.రఘు, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఉన్నత విద్యా నైపుణ్యాలతో దేశాభివృద్ధి



యూనివర్సిటీ ప్రాక్టికల్ ల్యాబ్‌లను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఉన్నత విద్యా నైపుణ్యాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలనూ నేర్పుతున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం భవిష్యత్‌లో ఎంతో మందికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఆయన ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్‌రాజు ఆహ్వానం మేరకు శనివారం విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ శంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు అక్కడ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంతోపాటు మెకానికల్, వైద్య తదితర విభాగాలలో విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలను చాన్సలర్ వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మహిళలు కుట్టుమని నేర్చుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవడాన్ని డాక్టర్ శంకరరావు ఈ సందర్భంగా అభినందించారు.